
సూక్తులు

# కబీర్ సూక్తి ముక్తావళి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# కబీర్
# సూక్తిముక్తావళి

డా. శరకర్ శ్రీరామారావు

గీతాభవనము
ఏలూరు.
ఆంధ్రప్రదేశ్

# సమర్పణ

ఎవ్వనికిత్తు నీ కృతి, మ
హీవలయమ్మున స్వీకరింపగా
నెవ్వరు దీని కర్హులని
యెంచి మనోనయనమ్ము విప్ప నా
కవ్వలి వెల్గులో నొక ర
సాకృతిదోచె, కరమ్ముసాచి యా
పువ్వు పొలంతినందుకొన
బోయె తదాకృతి నిండు గుండెతో.

అవని జవాది వంశకల
శాంబుధిపూర్ణ శశాంకమూర్తియై
కవులకు కల్పవృక్షమను
కమ్మని కీర్తిగడించుకొన్న తత్

ప్రవిమల మానవాకృతికి
రాగమరందము గ్రుమ్మరించు ఈ
కవికుల కన్యకామణిని,
కావ్యసుధామణి, గాన్కవెట్టితిన్.

నెయ్యము తియ్యమున్ మనసు
నిండినవాడు, తెనుంగు తోటలో
వియ్యపు ముచ్చటల్ నెరపి
విందులుసేయు రసజ్ఞమూర్తి, యే
కయ్యము చెంతకున్ జనని
కమ్మదనమ్ముల పాడిపంట, ల
క్ష్మయ్య జవాది వాసనల
మర్మమెరింగినవాడు ధాత్రిలో.

విత్తమేలునాతి చిత్తమేలినసామి
పలుకు పొలతినేలు బాపనయ్య
సాములేమ యైన సరసుండు నేకమై
కృతి లతాంగి భర్త నేలుగాక!

# వినతి

హిందీ భాషా సాహిత్య ప్రపంచమున కబీర్ కవిత్వమున కొక ప్రత్యేక స్థానమున్నది. ఐదు శతాబ్దులకు పూర్వము భారత మాతృ గర్భ శుక్తి ముక్తా ఫలమై అవతరించి తన జీవిత ధారా ప్రవంతిచే మానవజాతిని పునీత మొనర్చిన మహాత్ముడు కబీర్. క్రీ. శ. 15వ శతాబ్దమంతయు ఆ మహనీయుని తత్త్వగానముతో ప్రతిధ్వను లీనినది. పూర్ణా యుర్భాగ్యమును రుచి చూచుటయే గాక తత్ సాధనాఫలమగు దివ్యానుభవమునందుకొన్న ధన్య జీవి యతడు.

కబీర్ తత్త్వవేత్త, పరమభక్తుడు, గాన కళాకోవిదుడు. సర్వ మత సామరస్యము, బాహ్యాడంబర నిరసనము, ప్రధాన వస్తు నిర్దేశము, అనన్యసామాన్యమగు లోకానుభవము ఈ మహనీయుని రచనలందు మృదు మధుర భాషాలంకార శోభితములై అడుగడుగునకు దర్శన మిచ్చుచు ఆనందరసాబ్ధి నోల లాడించును.

బహువిధ భేద భావములచే కలుషితమైన నేటి సంకుచిత వాతావరణమున నీ అమృత కలశమును దెరచి అందరి ప్రబోధ సుధారసమును సరళాంధ్ర వచన రచనా ప్రసాదముగ నందీయ దలచి నే నీ యనువాదమునకు పూనుకొంటిని. హిందీ భాషలోని 357 "దోహా" లను పేరుగల ద్విపదలకిది తెనుగుసేత. కవిత్వ

మందలి ధ్వన్యాది గుణవిశిష్టతలు, తత్త్వ నిరూపణమందలి సూక్ష్మాతి సూక్ష్మవిషయములు సాధ్యమైనంతవరకు తేటతెనుగు నుడికారమున దోయిలించితిని. నేటి పోకడల కనుగుణముగ నెల్లరకు సులభ గ్రాహ్యమగుటకు గద్యరూపమును స్వీకరించి సంధులు, శకట రేఫములు మొదలగు కొన్ని వ్యాకరణాది నిబంధనలను సడలించితిని. మూలము ననుసరించి అందు నిక్షిప్తమగు భావమును వీలైనంత సుస్పష్టముగ వెలువరించుటకే ప్రయత్నించితిని. ఎంతవరకు కృత కృత్యుడనైతినో అది నిర్ణయించ వలసినది కవులు, పండితులు నగు సహృదయులు.

ఇందలి విషయమంతయు, కర్తృనిరూపణ, దివ్యాను భవము, ప్రేమ-భక్తి, సాధన, పరీక్ష, వివేకము, సఫలత, అను నేడాశ్వాసములుగ "అవతార్ మెహెర్" పత్రికలో వరుసగ ప్రచురితమైనది.

"గీతా హృదయము" నందుకొని ఆంధ్రరసజ్ఞలోకము నాపై ఆశీస్సుమవృష్టి గురిసినది. "పూలమాల" కంఠసీమను ధరించి పలుకుపడంతి చిరునగవులు చిందించినది. తెనుగు గాయకులు "కృతులు, గేయములు" పాడుకొని పరవశులైరి, ఇక "కోకిల" కూజితములు, "కళాయోగి" నాటకీయత యెల్లరకు సుపరిచితములేకదా! నాకైతకు నీరుపోసి పెంచిన ఆంధ్ర సహృదయ లోక మీ "కబీర్ సూక్తిముక్తావళి"తో కంఠ సీమ నలంకరించుకొని ఆనందించుగాక! నాకును, మా కబీర్‌కును ఉపాస్య దైవమగు రామచంద్రుడు మీకు సర్వ శుభము లొసంగు గాక! కళా ప్రవంతి విషయవాంఛా ప్రకోపనకుగాక మానవ హృదయక్షాళన కుపకరించి లోకకల్యాణమును సాధించుగాక!

శంకర శ్రీరామారావు

# కబీర్ సూక్తిముక్తావళి

## కర్తృనిరూపణ

1. (నిరాకారుడగు) అక్షయ పురుష వృక్షమునకు (సాకారుడగు) నిరంజనుడొక (పెద్ద) శాఖ. బ్రహ్మ విష్ణుమహేశ్వరులను త్రిమూర్తులే ప్రశాఖలు. ఈ సంసారమంతయు పత్రరాజి.

2. నా స్వామి (ఈశ్వరుడు) ఒక్కడే. అతడద్వితీయుడు. వేరొకరిని స్వామిగా స్వీకరించితినా అతడు కోపించును.

3. అతడు శిరోముఖరహితుడు (రూపరహితుడు).

అందగాడునుకాదు. కురూపియుకాదు. అనుప మానమగు అతని తత్త్వము పుష్పగంధముకన్న అతి సూక్ష్మము.

4. దేహాంతర్గతమగు స్మృతివలె రూపవర్ణ రహితు డగు ఈశ్వరుడు అనంతవిశ్వమున వ్యాపించి యున్నాడు. (బాహ్య పదార్థానుభవానంతరమున అశరీరరూపియై శరీరమున మిగులునది స్మృతి. దానితో ప్రాణివలయునపుడెల్ల వస్త్వనుభవము నందు చున్నాడు. అట్లే సర్వవ్యాపియగు నీశ్వ రుని అనుభూతి ధ్యానసమాధిచే పొందనగు.)

5. సాధులోకమంతా చతుర్భుజుని (సగుణ) భజ నలో నిమగ్నమై పరుని మరచినది. నేను మాత్రము (నిర్గుణ) అనంతభుజునే స్మరించెద.

6. జననమరణ రహితుడు నాప్రభువు, ఈ సృష్టి అంతయు ఆతని రచన,

7. ఆతడు (సర్వవ్యాప్తుడగుటచే) ఒక డనుటకు వీలులేదు. ఇద్దరనుట అపరాధము (అద్వితీయ తకు భంగము). కబీరు బాగా అలోచించిచెప్పున దేమనగా ఉన్నవానినున్నటు లుండనిండు, ఈ ద్వైతాద్వైత చర్చలేల?

8. దేహధారణ, రూపరేఖలు యెఱుగని ఆ అశరీర పురుషుడు గగనమండల మధ్యస్థుడైయుండును, (అకసమువలె రూపరహితుడు, సర్వవ్యాపి.)

9. ప్రభూ! అట్టి నీవే నాస్వామివి. ఇతరులతో నా కేమిపని? ఇతరులు ఇతర దేవతలను భజింతురుగాక! వారి సంప్రదాయమే వేరు (కబీరు నిర్గుణోపాసకుడు, సగుణోపాసకుల తెగవేరు).

10. సగుణ (గురు) సేవచేయుము. జ్ఞానము చే నిర్గుణానుభవము పొందుము. నేను మాత్రము సగుణ నిర్గుణాతీతుని ధ్యానించెద.

11. ప్రభువు ఏమిచేయుటకును సమర్థుడు, దానిచేత నేమగును? ప్రభువు అవగింజను పర్వతముచేయ గలడు. పర్వతమును అవగింజగా మార్చగలడు,

12. జలమును స్థలముగా. స్థలమును జలముగా మార్చ గలడు. అతని హస్తలాఘవమటు వంటిది. సంకల్పమాత్రముచే సర్వము సిద్ధించును.

13. స్వామినిబోలు గంభీరమూర్తి, గౌరవశాలి, సర్వ సమర్థుడు పుడమిని కానరాడు (అతని కాతడే సాటి). ప్రాణుల దోషములనెన్నక గుణము మాత్రము గ్రహించి క్షణములో సంసారసాగర మును దాటించును.

14. నేనేమేమి చేసితినో అవన్నియు నీవొనర్చినవే. అందు నా కర్తృత్వ మిసుమంతయులేదు. ఒక వేళ నేనే చేసితినని అహంకరింతునా నాలోనుండి సర్వము నిర్వహించినది నీవుకావా?

15. ఈశ్వర రక్షణలోనున్న వ్యక్తిని ఎవరేమి చేయ గలరు? లోకమంతయు శత్రుత్వము వహించి వచ్చినను వాని రోమమైనను కదుపజాలదు.

16. నాస్వామి ఆరితేరిన వర్తకుడు, త్రాసు తక్కెడ లేకయే పాపపుణ్యములు తూచి సరళగతి వ్యాపారమొనర్చును.

17. ప్రభూ! నీవులేనివాడు నిర్ధనుడు. నీ రక్షణ ముద్ర దాల్చినవాడు లక్షాధికారి.

18. పుష్పములోని పరిమళమువలె నీ ప్రభువు నీ యందే యున్నాడు. కాని, కస్తూరిమృగమువలె నీవు వానికొరకు బాహ్య ప్రపంచమంతా గాలించుచున్నావు.

19. ఎవరికొరకు నీవీజగమంతా వెదకినావో అతడు నీ హృదయమందే (దాగి) యున్నాడు. అజ్ఞాన మను తెరమాటున నుండుటచే నీకాతని దర్శనముకాలేదు. ఆ యవనిక నీస్వకపోల కల్పితమేసుమా!

20. నీస్వామి నీయందేకలడు. అన్యత్ర వెదకిన లాభమేమి? ఎరుకగలవాడవైతే ఇంటనేయుండి అంతర్దృష్టిచే నతని దర్శింపుము. (బాహ్య చక్షువులు మూసి ధ్యాననిష్ఠచే)

21. మనిషికొకమతము. వేషభాషలు వేనవేలు.

కాని, సర్వాంతర్యామి ఒక్కడే. అతడు అనిర్వచనీయుడు.

22. కోరికలను శిరోజములు శిరముపై ముడుచుకొని మైమరచి యేలతిరిగెదవు? తిలలోని తైలమువలె నీ ప్రభువు నీలోనే కలడు.

23. నువ్వులో నూనెవలె, చెకుముకిరాతిలో అగ్నివలె నీ స్వామి నీలోనే కలడు, తెలివిగలిగి తెలిసికొనుము.

24. కంటిలో పాపవలె సర్వశరీరాంతర్గతుడగు ఈశ్వరుని మూర్ఖులు బాహ్యప్రపంచమున అన్వేషింతురు.

25. అగ్నిరూపియగు స్వామి సర్వాంతర్యామి. చిత్తమునకు చెకుముకిస్పర్శ కలిగినప్పుడే ఆ దివ్యతేజోదర్శనము.

26. పరమాత్మ పరుసవేది. అశుద్ధలోహఖండము మనస్సు. స్పర్శమాత్రముచే మోహకశ్మలముడిగి స్వర్ణమై ప్రకాశించును.

27. సర్వేశ్వరుని నామమే సత్యసారము. దీని నెరిగినవాడు పరమహంస. ఆతనివంశమునకు అమరత్వసిద్ధి.

28. ఆదిపురుషునినామమే అన్నిటికి మూలము. మంత్రములన్నియు ఆ మహావృక్షమునకు

శాఖలు. ఆ నామమే లేకపోయినచో సంసార సాగరమున మునిగి చావవలసినదే.

29. నామరత్నమను మూలధనమును భద్రముగ మూట గట్టుము. మాటిమాటికి మూట విప్పకు సుమా! అది అమూల్యము. దానిని పరీక్షించు వాడుగాని, గ్రహించువాడుగాని ధారుణీతలమున లేడు; లేడు; లేడు.

30. రసాయనములన్నీ ప్రయోగించి చూచితిని. నామ రసాయనమునకు సాటి యెందునులేదు. ఈ ఘటమును బంగారమొనర్చుటకు నామ స్మరణ మణుమాత్రము చాలును.

31. ఏనాడు దివ్యనామమును హృదయమున ధరించితినో నిప్పురవ్వచే జీర్ణతృణములట్లు-నా పాపము లన్నియు ఆనాడే నశించినవి.

32. అంతరంగమున జ్ఞానదీపము వెల్గించి సహజ సమాధి నిష్ఠుడవై నామస్మరణ కుపక్రమించుము.

33. కలలోగాని, కపటమునగాని ఎవ్వనినోట భగవన్నామము వెలువడునో వానికి నాచర్మము చెప్పులు కుట్టించెద.

34. మాయాబద్ధమైన నీమనస్సు నామబద్ధమైననాడు తారామండలమును భేదించి నీ వమరపురికేగ గలవు. (బ్రహ్మరంధ్రము భేదించి)

35. పావకరూపియగు నా నామము సకల ఘటాంతర
వర్తియై యుండును. సాధనయను చెకుముకి
చిత్తమును రగుల్కొల్పమిచే అది మంటలేని
పొగయై యెగయుచున్నది.

36. నామస్మరణములేనిది కోటిభోగములేల? ఇంద్ర
పదవియేల? వైకుంఠనివాసమేల?

37. నామమును అందరు కొల్లగొట్టుచున్నారు, శక్తి
కలదేని నీవును దోచుకొనుము. మరణవేళ విచా
రించి యేమిఫలము.

38. హఠయోగులు, తాంత్రికులు, నాదోపాసకులు
మరణించుట తథ్యము, రామభక్తులకుమాత్రము
మృత్యువనునదిలేదు. ఇది కబీర్ ప్రత్యక్షానుభ
వముతో చెప్పుమాట.

39. ఎక్కడచూచినను నా ప్రియతముని ప్రేమ
జ్యోతియే. వానిని చూడబోయి నేనేతానైపోతిని.
(జీవాత్మ పరమాత్మ సంధానము. అద్వైతసిద్ధి)

40. ఎవనికొరకు భూమియందలి దేశవిదేశములు
గాలించి తిరిగితినో ఆ నా ప్రియతముని పొంది
నంతనే దూరదేశములు నా గృహప్రాంగణము
లైనవి. (స్వపరభేదము నశించినది.)

41. పరమాత్మ సంధానమెప్పుడాయెనో ఆ క్షణ
మందే అనంతజ్యోతి ప్రకటమైనది. స్వామి

భృత్యన్యాయము నశించి నిత్యవసంతలీలానుభవమే మిగిలెను. (బ్రహ్మానందము)

42. యోగియైనంతనే పరంజ్యోతి ప్రకటితమైనది. ద్వంద్వభావము తొలగినది. బ్రహ్మైక్యమొదవి బ్రహ్మత్వమే ప్రాప్తించినది.

43. ఉప్పు కరగి నీరైనది. ఇక గోనె సంచులకెత్తు టెట్లు? ఆత్మ పరమాత్మలో లీనమైనది. పాపము కాలమేమి చేయగలదు! మౌనముద్ర దాల్చినది.

44. చెప్పవలసినదంతా (ఉపదేశము) ఈవరకే చెప్ప బడినది. ఇక చెప్పవలసిన దేమున్నది? ఒక నది (జీవాత్మ) పోయి పోయి సముద్రమున (బ్రహ్మమున) లీనమైనది. ఇంకొకటి పోవు చున్నది. అందరి ప్రయాణము అక్కడికే! తరంగములు కానీ, తరంగిణులు కానీ కడలి గర్భమునే కదా జేరునది!

45. స్థిరము, అంతర్ముఖమునగు మనస్సు బ్రహ్మ రంధ్రమునకు జేర్చును. అది నిరంజనస్థానము. అచ్చోట చంద్రుడులేకయే వెన్నెలగాయును.

46. అహంకారముడిగి ముక్తుడనై అగమ్యమగు బ్రహ్మలోక ప్రాప్తిగంటిని. ఓ భగవంతుడా! ఇక నీవుతప్ప నాకెవరునులేరు. నా ఆశలన్నీ నీమీదనే.

47. ఆత్మ బ్రహ్మమందును, జపము అజపమందును, వ్యక్తము అవ్యక్తము నందును కలిసిపోయినవి.

48. పరబ్రహ్మముయొక్క తేజస్సు చర్చనీయాంశము కాదు. అది చెప్పనలవి కానిది. ప్రత్యక్షప్రమాణమే ఏకైకసాక్ష్యము.

49. ఎప్పుడు శరీరము ప్రేమపులకితమైనదో అప్పుడే అంతఃకరణము జ్యోతిర్మయమైనది. ధ్యానమగ్నుడగు ఆ వ్యక్తి ఆనందమందిరమట్లు సుప్రసన్నుడు. వాని వాణి అర్ష సుగంధ బంధురము. (సత్యసుందరము)

50. బహురూపదర్శనార్థినై నేనిటకు వచ్చితిని. భక్తి కుదిరినంతనే ఏకైకదృష్టి లభించి బ్రహ్మసాక్షాత్కారమొదవినది.

51. ప్రాప్తవస్తువును భద్రపరిచితిని. ఏమిదానిరుచి! లోకమంతా వెదకి వేసారితిని. సాటిలేని రత్నమును బడసి ధన్యుడనైతిని.

52. నేను దర్శించినది వర్ణనాతీతమగు ఆతని దివ్యదేహమందలి ఒక భాగము మాత్రమే. ఆ తేజఃపుంజమును స్పృశించితినో లేదో అది నాకన్నులలో నిలిచి పోయినది.

53. హృదయాకాశమున భక్తిసంభరితములైన మేఘములు గర్జించి ప్రేమవృష్టి కురిసినవి. బ్రహ్మజ్యోతి తటిల్లత రూపమున దోచి నలుదెసల

నిండినది. ఈ కబీరుదాసు ఆ ప్రేమధారలచే తలమునకలుగా తడిసి తన్మయుడైనాడు.

54. జ్ఞానదీపము వెల్గించి పరమాత్మనుదర్శించితిని. చతుర్వేదములకు సైతము చొరరాని అచ్చోటికి జేరి కబీర్ స్వామిని సేవించుకొనుచున్నాడు.

55. దేవుని హృదయమందే దర్శించితిని. ఇక గుణ గానమెందులకు ? అతడు లభించనంతవరకే దాని ప్రయోజనము,

56. బ్రహ్మరంధ్రమున (శూన్యమండలమున)నివాస మేర్పరచుకొంటిని. మధుర నాదమాలకించి పులకించితిని. కృపామూర్తి దర్శన భాగ్య మొదవినది. రోమమొక దీపమైవెలిగినది.

57. నీరు (పరమాత్మ) గడ్డకట్టి మంచు (జీవాత్మ) అయినది. ప్రళయవేళ అది తిరిగి నీరైనది. ఏదియేమి కావలెనో అది అట్లే అయినది. ఇక (కబీర్) చెప్పవలసిన దేమున్నది?

58. బ్రహ్మ సరోవరమున మనోమీనముల సంచలనము. నీరములింద్రియములు. తీరము పరమాత్మ. భేదభావము తొలగిననా డది అమృత సింధువై బ్రహ్మానంద మొసంగును.

59. ఎవ్వనియందు సర్వము ఇమిడి యున్నదో ఆ ఏకైకమూర్తినే నిత్యము ధ్యానించెద. అతడు

విశ్వరూపుడగుటచే అందరూనావారే. నేనును
అందరివాడనే. (అక్కడ భేదమునకుతావులేదు)

60. సద్గురు సహాయమున త్రిగుణ ప్రకోప మణగి
నది. బ్రహ్మతేజస్సు నన్ను కప్పివేసినది. ఇక
ఒక వాదమెందులకు? (బ్రహ్మానందస్థితిలో
వాగ్వాదములకు తావులేదు.)

61. బహువిధవేషధారణలచే భ్రమతొలగునా?
ఈశ్వర పరిచయమునగాక భేదభావము
నశించునా?



# కబీర్ సూక్తిముక్తావళి

## దివ్యానుభవము

62. నా ఆత్మానుభవమును గురించి ఎవరేని ప్రశ్నించిన నే నేమని చెప్పగలను ? మూగవాడు బెల్లముతినునేగాని దాని రుచిని వర్ణించి చెప్పగలడా ?

63. మూగవాని సంకేతములు మూగవానికే యెరుక. జ్ఞాని అనుభవించు ఆనందము జ్ఞానికే తెలియును.

64. కాగితముపై వ్రాయువాడు వ్యావహారికజీవి. ఆత్మద్రష్టకు లేఖినిలేదు. అతనికి సర్వత్ర ప్రియదర్శనమే.

65. వ్రాతకోతల కందనిదావస్తువు. చూడవలె; అనుభవించవలె. వధూవరులు(జీవాత్మపరమాత్మలు) కలిసికొన్నారు. ఇక పెండ్లి తరలింపులేల? (పాంచభౌతిక ప్రసక్తియేల ?)

66. అనుభూతి కల్గిననాడు పండితుని అహంకారము తొలగును. అజ్ఞాని బుద్ధిమాంద్యము నశించును. ఆ స్థితిలో శూన్యత్వ పరిపూర్ణత్వవిభేదము లుండవు.

67. సాధుపురుషుడు చేటవలె నిరర్థక వస్తువులను చెరగివైచి సారోదారమగు అవసర వస్తువునే గ్రహించును. అది వాని స్వభావము.

68. అతడు దోషమును పరిహరించి గుణముమాత్రమే గ్రహించును. రసపాన మొనర్చు మధుపము పుష్ప పరిమళమును గుర్తించునట్లు సజ్జనుడు మానవహృదయమందలి పరమాత్మను గుర్తించి స్వీకరించును.

69. హంస క్షీరమును గ్రహించి నీరమును త్యజించునట్లు సారగ్రహణ పారీణుడగు తత్త్వవేత్త నిస్సారవస్తువును వదలి సంసారసాగరమును తరించుచున్నాడు.

70. క్షీరరూపమగు భగవన్నామమును స్వీకరించి నీర రూపమగు లోకవ్యవహారమును విసర్జించునతడే తత్త్వరహస్యమెరిగిన పరమహంస.

71. సద్గురుప్రసాదమున అచలజ్ఞానమును, సమ దృష్టియు లభించినవి. ఎటుచూచినను పరమాత్మ వస్తువొక్కటే కానవచ్చుచున్నది, తదితరము లేవియు కనబడుటలేదు.

72. గురువరేణ్యుడు సమదృష్టినొసగి వికారదూరుని జేసెను. ఇప్పుడు నాకన్నిట స్వామిదర్శనమే.

73. సర్వప్రాణులను ఆత్మీయులుగా చూచుటే శాంతి ప్రదమగు సమత్వము.

74. దుఃఖసమయమున భగవంతుని స్మరింతురు. సుఖసమయమున స్మరింపరు. సుఖసమయమున స్మరించుచుండినచో దుఃఖమే కలుగదుకదా !

75. సుఖమున విస్మరించి, దుఃఖమున మొరపెట్టు కొనిన ఎవరైన వినిపించుకొందురా !

76. విషయాసక్తుడు కామస్మరణమొనర్చునట్లు క్షణమైనను ఎడమీయక రేయింబవళ్ళు ఎనిమిది జాములందును రామస్మరణ సేయుము.

77. నాదమాధుర్యమున జొక్కు హరిణమట్లు నీచిత్తమును నామస్మరణమున లగ్నము సేయుము. కబీర్‌దాసునకు ప్రాణత్యాగముతోనే నామ త్యాగము. మరపురాని దానిని మరచుటెట్లు ?

78. నోరుమూసికొని మౌనస్మరణమున నిమగ్నుడవగుము, బహిర్ద్వారము బంధించి అంతర్ద్వారము తెరచియుంచుకొనుము.

79. చేతిలోని మాల యుగయుగాలుగా తిరుగుచునే యున్నది. మనస్సు తిరుగుట మాత్రముమాన

లేదు, జపమాలను వదలి మనస్సు మళ్ళించు కొనుము. (ఆడంబర నిరసనము.)

80. నామాల మనోమాల. వేషభాషలేల ? మాల త్రిప్పుటచేతనే దేవదర్శనము లంభించినచో గిలకమాతులందే హరినివాసము.

81. కట్టెతోచేసిన జపమాల కృత్రిమము. ప్రయత్న పూర్వకముగ త్రిప్పవలె. ఉచ్ఛ్వాస నిశ్వాసము లలో లీనమగు స్మరణమే సహజమైనది.

82. సహజమగు నాదము నిరంతరము హృదయమున ధ్వనించుచునే యున్నది. జీవాత్మ పరమాత్మలో లీనమైనది. ఇక వాగాడంబరమేటికి ?

83. చేత మాల తిరుగుచున్నది. నోట నాల్క తిరుగు చున్నది. మనస్సు పదిదిశల తిరుగుచున్నది. ఇదేనా నామస్మరణ ?

84. ఆత్మ పరమాత్మను జేరినప్పుడే మనోవాక్కాయ ముల స్థిరత్వము. కల్పాంతరములు కర్మానుష్ఠా నము చేసినను అది లభించదు.

85. జపము చేసినవాడును మరణించును; చేయని వాడును మరణించును; నాదోపాసకుడును మృత్యువు వాతపడకతప్పదు. ఆత్మసాక్షాత్కార మొదవిన భాగ్యశాలికి మాత్రము మృత్యు భయము లేదు.

86. ఆకలి కుక్కవంటిది. భజవ కడ్డుతగులు

చుండును. దానికింత పడవేసి నిశ్శంకగా నామ స్మరణ సేయుము.

87. నిన్ను స్మరించి నీవైపోతిని. "నా" అనునది నశించినది. "నేను" నీ నామమునకు బలియైనది. ఎక్కడచూచినను "నీవే!"

88. నాకిక చింతయేల? చింతించి లాభమేమి! నా చింతలన్నీ హరిభరించుచున్నాడు. నాకేచింతయు లేదు.

89. సాధుపురుషుడు ఆనాటి కవసరమగుదానినే స్వీకరించును. రేపటికి మూటగట్టడు. అతని ముందువెనుకల స్వామి నిలిచి ఎప్పుడు ఏది కోరిన అది సమకూర్చును. ముందు వెనుక లాలోచించవలసిన అవసర మతనికిలేదు.

90. తెల్లవారినది, జీవజగత్తు మేల్కాంచినది, ఎవరి పొట్ట కెంత అవసరమో అది భగవంతు డిచ్చుచునే యున్నాడు.

91. తలబ్రద్దలుకొట్టుకొన్నను బ్రహ్మవ్రాలుమాన్ప నెవరి తరము? ఎవరి కర్మానుసారము వారికి జరిగితీరును, ఆవగింజంతయైనను తగ్గదు.

92. భగవంతుడా! నాకును నా కుటుంబమునకును అతిథి, అభ్యాగతులకును సరిపడుదానినిమ్మా. ఏ సాధువుగాని నా గృహమునుండి ఆకలితో మరలి పోరాదుసుమా!

93. శరీరమొక పూలమొక్క, మనస్సు దానిచుట్టూ తిరుగు భ్రమరము. అర్థము (ధనము) అనుపమ సుగంధము, నామజలసేచనముచే విశ్వాసరూప మగు అమృతఫలము లభించును.

94. నీ గుణ గానము చేయనివారును, చేయుచుండియు శ్రద్ధలేనివారును నినుపొందజాలరు. గాఢ విశ్వాస ముతో నిను కీర్తించువారి కెప్పుడు నీవు సన్నిహితుడవే!

95. హృదయములోనే అద్దమున్నది. ద్వంద్వరహిత మైనప్పుడే పరమాత్మ ప్రతి బింబమందు కాన నగును.

96. చదివితిని. నేర్చితిని. మననము చేసితిని. సంశయ విచ్ఛేదముకాలేదు. ముల్లుకదిలి బాధించుచునే యున్నది. దేవా! నా దుఃఖములన్నిటికి మూల కారణమేమి?

97. చీమ (జీవాత్మ) (బ్రహ్మమను) బియ్యపు గింజను నోటకరచుకొని చనుచున్నది. మార్గ మధ్యమున పప్పుగింజ (మాయ) కనబడినది. దానికై తహతహ పడినది. కబీర్ చెప్పున దేమనగా ఓ వెఱ్ఱి వాడా! రెంటిని ఏకకాలమందు భరింపజాలవు. ఒకదానిని స్వీకరించి రెండవ దానిని త్యజించుము.

98. నీకు రామనామము చేదైనది. ధనమే మధుర మైనది. రెంటికి చెయిజాచితివి. రెండును చెయిజారిపోయినవి. రాముడు దొరకలేదు. మాయ మాయమైనది.

# కబీర్ సూక్తిముక్తావళి

## ప్రేమ — భక్తి

99. ఎంతవరకు సంసారసంబంధముండునో అంత వరకు భక్తి కుదురనేకుదురదు. సర్వబంధములను ఛేదించి హరిభజన సేయువాడే నిజమైనభక్తుడు.

100. భక్తికీ, బాహ్యవేషమునకూ భూమ్యాకాశముల కున్నంత దూరము. భక్తుడు గురుచరణములపై వ్రాలును. వేషధారి సంసారవాంఛల దగుల్కొనును.

101. భక్త్యనుకరణచే భక్తి కుదురదు. అట్టి కృత్రిమ భక్తుడు పాము కుబుసమును వదలునట్లు ఆపద లందు తనభక్తిని చల్లగా జారవిడుచును. (ఆడంబరభక్తి పరీక్షకు నిలువజాలదు)

102. కలుపుచే సస్యము, మూర్ఖునిచే సభ, లుబ్ధత్వముచే భక్తి, ధూళిచే కుంకుమపువ్వు చెడును.

103. కామక్రోధ లోభములు భక్తికవరోధములు, జాతివర్ణ కులాభిమానములు వదలిన శూరుడే భక్తిమార్గమునకర్హుడు.

104. చేపకు మంచినీరు, లోభికి ధనము, తల్లికి బిడ్డ, ఎంతప్రియమో భక్తునకు భగవన్నామము అంతే.

105. కామ్యభక్తితో చేసినసేవ నిష్ఫలము. కారణ మేమన, నాస్వామి ఇచ్ఛారహితుడు, అతనికి నిష్కామ భక్తియే రుచించును.

106. భక్తియను బంతితో ప్రపంచమైదానమున వలయు వారందరు ఆడుకొనవచ్చును. అందు ధనికుడు నిరుపేద అను భేదములేదు.

107. అంతరాయము లెరుగని ఈశ్వరప్రేమయే భక్తి. అది ప్రాణమున్నంతవరకు జీవాత్మ నంటిపెట్టు కొనియుండి, మృత్యువేళ పరమాత్మలో లీన మగును.

108. నిద్రవేళ స్వప్నగోచరుడగును. జాగ్రదవస్థలో మనమున తాండవించును. నిత్యము కనుపాప లలో కదలుచు, మనసులో మెలగుచునున్న నాస్వామితో నాకు వియోగమెక్కడ!

109. "నీవు" "నీవు" అని అరచి అరచి నీవై పోతిని. నీలో లీనమైపోతిని. నామనస్సు నీలో కలిసి పోయినది. ఇంకెక్కడికి పోగలవు?

110. ధనమునకు లెక్కయున్నది. రాజ్యమునకు కొలత యున్నది. ఒకటి కోట్లసంఖ్యగా

లెక్కించవచ్చును. రెండవది ఉదయాస్తమయ ములతో. భక్తి మహత్వమును లెక్కింప నెవరి తరము ?

111. ఆత్మవిచారము లేక అంధులై తిరుగుచున్నారు. హరిభక్తి లేనివాడు సంసారసాగరమున మునిగి చావవలసినదే.

112. ప్రాణులందరు కర్మకాండలో మునిగి తేలు చున్నారు. కబీర్ ఉచ్చకంఠముతో చెప్పున దేమనగా భక్తి సంభరితమగు కర్మయొక్కటే నిష్కామము. ధర్మమును త్యజించి భక్తిని చేబట్టుము. (ధర్మకర్మములు పైతము భక్తికి చాలవు)

113. ఈ ప్రపంచము ప్రేమప్రపూర్ణమగు గేహము. సవతి తల్లి యిల్లుకాదు. వినయ నమ్రుడవైన గాని నీకిందు ప్రవేశము లభించదు.

114. కబీర్‌దాస్ చెప్పునదేమనగా సోదరా ! తలవంచి (అహంకారము త్యజించి) ఈయింట కాలిడుము.

115. ప్రేమ తోటలో మొలకెత్తునదికాదు. బజారులో అమ్మబడునదియు కాదు. రాజుగాని ప్రజగాని ప్రేమ పిపాసువులెవరైనను సరే అహమునిచ్చి ప్రేమను పుచ్చుకొనవచ్చును. (Barter)

116. గర్వము దక్షిణగా నొసగి, ప్రేమపాత్రను గైకొనుము. లోభి, గర్వమును విడనాడజాలడు.

నామప్రేమకు చేయిజాచును. వానికది యెట్లు లభించును?

117. క్షణ క్షణము మారుచుండునది ప్రేమ కానేరదు. పరమాత్మపంజరమున స్థిరనివాసముండునదే సరియైన ప్రేమ.

118. ప్రేమమార్గము చాలా యిరుకైనది. అందిరువు రకు తావులేదు. "నే" నంటినా పరమాత్మలేడు; ఆతడున్న "నేను"లేను. (ప్రేమ, అహంకారము పరస్పర విరుద్ధములు)

119. ప్రేమసంచారములేని హృదయము కేవల శ్మశానము. అతని శరీరము ప్రాణవాయువు లేని కమ్మరితిత్తి. (చర్మభస్త్రి).

120. నూరు యోజనముల దూరమందుండియు నా స్వామి నిత్యము నా హృదయమందే విరాజిల్లు చున్నాడు. పరమాత్మ కపటభక్తుని గృహప్రాం గణమున కాపురమున్నను వారిద్దరిమధ్య సప్త సముద్రము లడ్డమై యుండును.

121. జీవాత్మ పరమాత్మ తత్త్వములకు ప్రాణ మొక్కటే. శరీరములు మాత్రమే వేరు. కావున నో దేవా! నా హృదయ రహస్యమును నీహృద యముచే గ్రహింపుము.

122. నేను నిత్యము నిన్నే స్మరించుచున్నాను. కాని నీవు నా వంకైనను చూచుటలేదు. ఐననేమి?

నామనస్సు నీయందే లగ్నమైనది. నీ నామ స్మరణమే నాకు పరమప్రీతి.

123. నామనస్సు స్వామి ప్రేమతో నిండిపోయినది. రోమ రోమము నామస్మరణ సేయుచున్నది. ఇక నోటితో నేమిపని ?

124. జాగ్రత్ స్వప్నావస్థలలో శ్వాసవలె పరమాత్మ హృదయమున నిత్యుడై యుండును. భావుకున కాత డెప్పుడూ సన్నిహితుడే.

125. ప్రేమరస పానము చేయదలతువు; స్వాభిమానము ను వీడజాలవు. ఒక యొరలో రెండుకత్తులా ! కని విని యెరుగము.

126. కబీర్ చెప్పునదేమనగా, గురూపదేశము చవి చూచిన నాకు ఇతరములు రుచించవు. నాఘట ప్రారబ్ధము నశించినది. నాకిక పునర్జన్మలేదు. నా పుణ్యము ఫలించినది.

127. అన్ని రసాయనములు సేవించి చూచితిని. ప్రేమకు మించిన రసాయనములేదు. అది లవలేశము శరీరమున ప్రవేశించెనా ఆ క్షణమే ఈ తనువంతయు సువర్ణ మగును.

128. పరమాసక్తితో నా ప్రియుని ప్రేమామృతము గ్రోలి తృప్తుడనైతిని. దర్శనభాగ్యముచే పరవశుడనైతిని. ఇక నాకు మోక్షమేల ?

129. ఈ ప్రపంచమున అతని కలియుట దుర్లభము. కలిసియు కర్మవశమున దూరస్థుడైన సజ్జనుడు

మరల మరల ఆ అమూల్యరత్నమునే అన్వే
షించును.

130. శరీరములు కలిసినంతమాత్రముచేత దానిని
ప్రేమ యనరాదు. మనసులు కలియుటే సత్య
మగుప్రేమ; అదియు పరమాత్మ పరమగునపుడే.

131. నేత్రములను చిన్నగదిలో కనుగ్రుడ్డను మంచము
వాల్చి ప్రక్క వేసితిని. రెప్పలను తలుపులుమూసి
నా ప్రియుని ప్రసన్నుని చేసికొంటిని.

132. మృత్యుభయ మున్నంతవరకు సత్యమగుప్రేమ
కుదురదు. ప్రేమగృహము కడుదూరము. దానిని
మనసా పొందవలె. (శరీరము చేతకాదు.)

133. హరిని వదలి హరిజనుని ఆశ్రయించుము.
(భగవంతుని వదలి భక్తుని ఆశ్రయించుము.)
భగవానుడు రాజ్యభోగములిచ్చును. భక్తుడు
భగవంతుని తెచ్చియిచ్చును.

134. శరీరధారినై నీకు దూరస్థుడ నైతిని. ఈ చర్మ
చక్షువులతో నిన్ను చూడజాలను. కాని నా
ప్రాణము మాత్రము నీకు నిత్యసన్నిహితము.

135. కలువ నీటను, చంద్రుడాకసమునను ఉందురు.
అంతదూరమున నుండియు వారి ప్రేమ అనుప
మానము. మనసుకు నచ్చినవారెప్పుడును సన్ని
హితులే. అక్కడ దూరప్రసక్తియేలేదు.

136. విదేశవాసియగు ప్రియునకు ప్రేమసందేశములు కాని, తను మనో నయనముల నిండియుండు నా ప్రియునకు ప్రేమలేఖ లేల ?

137. అగ్నిజ్వాలలు సహింపవచ్చును. ఖడ్గధారయు ఓర్వవచ్చును, ఏక రసమగు ప్రేమను భరించుట మాత్రము కష్టతరము.

138. ప్రేమను భరించుటలోనే సాఫల్యతకలదు. సిద్ధి నందుటకు అన్యమార్గములేదు. ప్రేమకై శిరము నిమ్ము, మనస్సునిమ్ము, తనువునిమ్ము. సర్వ త్యాగముచేసి ప్రేమను దక్కించు కొనుము.

139. గాజు దెబ్బకు పగిలిపోవును. వజ్రము దెబ్బలకు లెక్కచేయదు, అగ్నితప్తమై కనకము తేజరిల్లును, తగరమట్లుకాదు, కష్టమును సహించ లేని చంచలస్వభావునకు సుస్థిరప్రేమ జనించదు.

140. కష్టసహిష్ణుతగలవానికే ఈశ్వర సాక్షాత్కారము. (ఈశ్వరనాదము వినబడుట) కబీర్ చెప్పున దేమనగా, అట్టివారే నా వంశీయులు. (ఆత్మీయులు) Birds of my feather

141. విరహిణి ప్రేమసందేశము పంపుచున్నది. ప్రాణ ప్రియా ! జలములేనిదే చేప జీవింపజాలనట్లు నీవులేనిదే నేను బ్రతుకజాలను. (పరమాత్మ-జీవాత్మ ప్రణయము)

142. నీ యెదురుతెన్నులు చూచి చూచి నాకన్నులు చీకు వడినవి. నీకై అరచి యరచి నాలుక చిల్లులు పడినది.

143. నీ వియోగదుఃఖముచే కన్నీరు మున్నీరైనది. నేను ముత్తెపుచిప్పనై వగవగల వగచుచుంటిని. (ముత్తెపుచిప్పస్వాతిబిందువుకై పరితపించును.)

144. నీ నామస్మరణచేయుచు బహుదినములుగా నీరాక కెదురుచూచుచుంటిని. నామనస్సు నిను గలియుటకు తహ తహ లాడుచున్నది. నిన్ను చూడనిదే నాకు శాంతిలేదు.

145. విరహాభుజంగము కాటువేసినది. ఈబాధ తొలగించు మంత్రమగుపడదు, మరణమో ఉన్మాదమో తప్పదు.

146. విరహమను కాలసర్పము హృదయమును గాయపరచినది, శరీరము స్తంభించినది. ఆ విషాహిదాని చిత్తము వచ్చినట్లు దేహమంతానమలివేయుచున్నది.

147. ఈ విరహిణికి మరణము ప్రసాదించుము; లేదా ఆత్మదర్శన మొసగుము, ఎనిమిదిజాములూ ఈ వియోగాగ్ని జ్వాలలు భరించుచు బ్రతుకజాలను.

148, నయనద్వయమను బైరాగి విరహకమండలముతో

వచ్చి దర్శనభిక్ష వేయుచున్నాడు. తత్ప్రసాద లబ్ధిచే నిత్యతృప్తుడై వెలయగలడు.

149. ఈ దేహ మొక దీపము. దీనికి వత్తి ప్రాణము, రక్తమే తైలము. ఈ దీపపువెలుగులో నాప్రియుని దర్శించితిని.

150. కాంతుని దర్శనము నవ్వులతో లభించదు. రోదనమే పరమసాధనము. నవ్వులాటలతో ప్రియ సంయోగము సాధ్యమగుచో ఇక లోకములో వైధవ్యమే ఉండదు.

151. శరీరము కృశించి అస్థిపంజరము మిగిలినది. కాకిచూపు పడినది. కాని నాస్వామి యింకను రాలేదు. ఎంత మందభాగ్యుడనోకదా!

152. ప్రేమతో నిండిన నాకన్నులు వియోగముచే దుఃఖ దాయకములైనవి. ప్రేమవివశుడనై కన్నీరు కాలువలుగట్ట నేడ్చుచు రాత్రియంతయు గడపితిని.

153. ప్రియుని జేరగోరుదువు. శరీరశ్రమ కోర్వ నందువు. ప్రసవవేదనలేని పుత్రజననమా! అసంభవము.

154. విరహిణి తడికట్టెవంటిది. తడిగానున్నంతవరకు సరిగా మండక పొగవచ్చును. అగ్నిచే తడి యారినవెంటనే కాలిపోవును. భక్తునకు ముక్తి లభించుటయు నట్లే.

155. పర్వతములన్నిటను కలయవెదకితిని. ఏడ్చి ఏడ్చి కన్నులు పోయినవి. ఆ సంజీవిమూలికమాత్రము దొరుకలేదు.

156. హృదయమున దావాగ్ని మండుచున్నది. పైకి పొగ వెగయుటలేదు. లోలోన కాల్చివేయు చున్నది. ఆ బాధ రగిల్చినవాని కెరుక; అనుభ వించుచున్న నాకెరుక. ఒరులకెట్లు తెలియును?

157. అన్నివృక్షములచరికి న్నేగి ఆ యా ఫలములు చవిజూచితిని. (అన్నిసిద్ధాంతములు చర్చించి తిని.) తిరిగితిరిగి తుదకు దర్శనభిక్ష నిడుమని ఈశ్వరుని ప్రార్థించుచుంటిని.

158. ప్రియ విరహజనితమైన హృదయవ్యధకు లోనైతిని, అనుక్షణము నన్నది బాధించుచున్నది. రాత్రిలేదు, పగలులేదు. నేను దీనితో అంత మొందుదునా? ప్రాణములు నిలుచునట్లులేదు.

159. ఈశ్వరవిరహార్తుని పరిహసింపకుసుమా! ఆతడు సుల్తాను. విరహవేదనలేని హృదయము శ్మశానము. (సుల్తాను-ప్రేమ సామ్రాజ్యమునకు ఏలిక.)

160. ఈ నిరీక్షణతో పగలు గతించినది. రాత్రి గతింప నున్నది. ప్రియుని జాడ కానరాదు. భయమగు చున్నది.

161. నాస్వామి నన్ను తన బాహు బంధమున

గ్రహించి, తనవానినిగా చేసికొని, తన చరణ కమల చ్ఛాయలలో నుపవిష్టుని జేయు చెన్నదో కదా!

162. ఈశ్వర విరహ తప్తుని హృదయమునకు బాహ్య స్పర్శయుండదు. ఆతడు పరమాత్మను ధ్యాన సమాధి మగ్నమగు మనస్సున సాక్షాత్కరించు కొనును. దర్పణ సుందరి చేజిక్కునా? అట్లే బాహ్య ప్రపంచమున ప్రతిబింబించు పరమాత్మ యును. అంతఃచక్షువు చేతనే ఆతనిదర్శింపనగు.

163. విరహతాపముతో పడుచు లేచుచు, నీకై నిరీక్షించు చుంటిని. నేను మృత్యువువాత పడిన వెనుక నీ దర్శనమువల్ల నాకేమి ప్రయోజనము, (నిన్ను పొందుటకై ఎన్నోజన్మలెత్తితిని, ఎన్నోసార్లు మరణించితిని. నా ప్రేమ నిస్పృహచే నశింపక మునుపే నన్ననుగ్రహింపుము. ఆ తరువాత నీ వెవరికి కావలెను?)

164. ఈశ్వరా! నేను మట్టియైన వెనుక రాకు సుమా: ఇనుము మట్టిలో కలిసిపోయిన వెనుక పరుసవేది ఏమిచేయగలదు?

165. శరీరము వీణ. (సారంగి) నరములు తంత్రులు. విరహిణి (భక్తుడు) నిత్యము ఆ వీణ వాయించు చుండును. ఆనాదము తనకూ ప్రియునకు (ఈశ్వరునకు) తప్ప ఒరులకు వినపడదు.

166. నిన్ను మరతునని యెన్నడు తలంపకుము. ఆ ఊహ నీ మనమున జనించెనా నా ప్రేమ కుంటుపడును. ప్రాణముండువరకూ నిన్ను స్మరింతును. మరణవేళ నీ స్మరణ మగ్నుడనై ప్రాణములు త్యజింతును.

167. మనశ్శరీరములు విరహాగ్ని తప్తములైనవి. జీవుడు పరతత్త్వమున నిమగ్నుడైనాడు. ఇదే జీవాత్మపరమాత్మ సంధానము. ప్రేయసీప్రియుల ప్రణయసిద్ధి.

168. విరహమను గొడ్డలివేటుతో శరీరము గాయపడినది. నెత్తురు కాలువలు కట్టి ప్రవహించుచున్నది. అది ఆపినను ఆగకున్నది. ఇక మరణము నిశ్చయము. కాని నాకెట్టి చింతయు లేదు. ఈ రక్త ధారలతో నా భ్రమ మోహములు నశించినవి,

169. వైద్యుని పిలిచితిని. అతడు నా చెయిబట్టి నాడి పరీక్షించినాడు. కాని అతనికి నా వ్యాధి బోధపడలేదు. అది హృదయవేదన. అతనికెట్లు తెలియును ?

170. పతివ్రత కురూపియైననేమి ? మలిన వస్త్రయైననేమి ? ఆమె కోటి సుందరీమణులకన్న మిన్న. (పతివ్రత - అనన్యభక్తుడు)

171. పతివ్రత పతినే భజించును. ఇతరులను కన్నెత్తియైన చూడదు. సింహకిశోరము పస్తుండును గాని పచ్చిక మేయునా ?

172. నీవు నా కన్నులలో ప్రవేశించుము. రెప్పలు మూసి నిన్ను రక్షించుకొందును. ఇక నే నొరుల జూడను. నిన్ను చూడనీయను.

173. ఈ కబీరు సముద్రమందలి ముత్తెపుచిప్ప. అది నిత్యము "దాహము దాహము" అని అరచు చుండును. (విలపించుచుండును) స్వాతి నక్షత్రమునుండి రాలునీటిబిందువుకొరకే అతపస్సు. ఇతర నీటిబిందువుల నొల్లదు. (కడలి మధ్యమున నుండియు ఆ నీటిని ముట్టనైన ముట్టదు. సుదూరమందున్న స్వాతి జలబిందువునే అభిలషించును.)

174. ముత్తెపుచిప్ప ప్రతిజ్ఞ కడు భయంకరము. స్వాతినక్షత్రజలబిందువు కొరకు నిరీక్షించును. అది లభించక దాహముచే సముద్రమున మునిగి చచ్చునపుడు ఆనీరు లోనికిపోకుండ చుంచువు బిగించును. ఆహా! ఏమిదీక్ష!

175. సుందరి స్వామినే భజించును. ఒరులనొల్లదు. క్షణమైనను అతని సాన్నిధ్యము విడువదు. (భక్తుడు పరమేశ్వరుని అట్లే)

176. సుందరి (భక్తుడు) రంగస్థలముజొచ్చి (సాధుస్థానము జొచ్చి) తన ప్రియునితో నాట్యముప క్రమించినది. తన హృదయమందలి కామవాసనలను తైలముచేసి జ్ఞానదీపిక వెల్గించినది.

177. శూరునకు తల నిలువదు. దాతకు ధనము నిలువదు. పతివ్రతకు తనువు నిలువదు. (సహ

గమనము). భక్తునకు శరీరస్పృహ ఉండదు. మనమున ఈశ్వరస్మృతి నిత్యము నిండి యుండును.

178. పతివ్రత (భక్తుడు) గాజు పూసలు ధరించి మలిన వస్త్రములు కట్టినను సూర్యచంద్రులతో సమానమగు కాంతి ఉట్టిపడుచు సఖుల మధ్య ప్రకాశించుచుండును.

179. పతివ్రత (భక్తుడు) పతిపై నిశ్చలవిశ్వాసముంచి భజించును. చిత్త చలనములేని ఏకైకదృష్టితో పతిదర్శన కాంక్షయై యుండును.

180. హృదయము ఈశ్వరప్రేమతో నిండిన భక్తుడు నోటితో నామమువల్లింపనక్కరలేదు. పతివ్రత పతిని భజించును. అతనిపేరు నోటవచింపదు.

181. బహుళపదార్థజ్ఞానము బ్రహ్మజ్ఞానమునకు సరి యగునా ? అతడొక్కడే సృష్టికర్త. ఇతరుల కది అసాధ్యము.

182. ఆ ఏకైక బ్రహ్మ పదార్థమునుండియే పత్ర ఫల పుష్ప శాఖా శోభితమగు నీ సంసారవృక్షము ఆవిర్భవించినది. దానిమూలము నెరిగిన వాని కింక కావలసిన దేమున్నది ?

183. నా నుదుట సిందూర తిలకమేల ? కన్నుల కాటు కేల ? నా ప్రియుడు సతతము నా కన్నులలో

రమించుచుండ వాటికి ఇతరములగు అలంకరణ
ములతో నేమిపని ?

184. రేయింబవళ్ళు నాకు నీ స్మరణతప్ప వేరొండు
లేదు. నిజముగా నాకన్నులలో కాపురముంటివి.
ఇక నిద్రకవకాశమే లేదు.

185. పతి మనసు నిర్మలమైనది. ప్రాణభయమే
పోయినది. సతీత్వ కర్తవ్య నిర్వహణకు
సంసిద్ధముగ నున్నది. (భక్తుడు ఆత్మార్పణకు
సంసిద్ధుడైనాడు)

186. ఆజన్మ పతివ్రతా ధర్మపాలనమొనర్చి సతి తన
పతిదేహముతో కంటకశయ్యపైనుంచి నాల్గు
ప్రక్కల నిప్పంటించినది. (సహగమనము)

187. నిజమైన పతివ్రత పతి ననుగమించి దేహత్యాగ
మొనర్చును. కాని స్వశరీరపోషణకై వైధవ్యము
స్వీకరించదు.

188. వేశ్య శయ్యపై తనువు సమర్పించును. మన
సీయదు. బాహ్యాంతరములనడుమ నొక పెద్ద
తెర. (అడంబరభక్తుని లక్షణము చెప్పబడినది.)

# కబీర్ సూక్తిముక్తావళి

## సాధన

189. సాధువులు పరార్థజీవులు. మేఘములు వర్షధారలచే గ్రీష్మతాపమును చల్లార్చునట్లు వారు తమ శీతలస్పర్శచే భవతాపము నపనయింతురు.

190. సింహాలగుంపులు, రత్నాలసంచులు, రాయంచల పంక్తులు, నిజమైనసాధువుల సమూహము ప్రపంచమున నెచ్చటను కానరావు. శ్రేష్ఠవస్తువులు కొల్లకొల్లలుగ లభించునా?

191. అన్ని వనములందును చందన వృక్షములుండునా? దళమునందలి సిపాయిలందరు శూరు లేనా? అన్ని సముద్రములందును ముత్తెములు దొరకునా? అట్లే ఈ విశ్వమున సాధుపుంగవు డెక్కడో అరుదుగ మాత్రమే లభ్యమౌను.

192. సాధుశబ్దవాచ్యుడు ఉన్నతోన్నతమగు ఖర్జూర వృక్షమువలె కడుంగడు దుర్లభుడు. ఆ చిటారు కొమ్మ నందుకొనిన భాగ్యశాలి ప్రేమరసభరిత మగు ఫలములను రుచిచూడగలడు. ప్రమాద వశమున కాలుజారెనా చూర్ణదేహుడై నశించును.

193. కాంతాకనకములను విసర్జించినవాడే నిజమైన సాధువు. నే నా మహాత్ముని పాదధూళిని.

194. వృక్షము తన ఫలములను తానే ఆరగించదు కదా! నది తన జలములను తానే త్రాగదుకదా! అట్లే సాధుపురుషుల శరీరధారణ ప్రజాశ్రేయము కొరకు. స్వార్థమునకుగాదు.

195. సాధువు లందరు వారి వారి స్థానములందు పూజ నీయులే. కాని ఆత్మజ్ఞానియగు గురువరేణ్యుడు వివేకచూడామణి యగుట నెల్లరకు మకుటాయ మానుడు.

196. నల్లమందుపూవులన్నియు తెలుపే. ఎక్కడో ఒక్కటి మాత్రము ఎఱ్ఱనిపూవుండును. అది సర్వోత్తమమైనది. సాధువు లెందరు లేరు! అందు వివేకియగు వాడొక్కడే సర్వ శ్రేష్ఠుడు.

197. సాధుశరీరము నిరాకారుని దర్పణము. ఈశ్వర దర్శన మభిలషించువారు దానియందాతని సాకారమూర్తిని దర్శించగలరు.

198. ఆత్మజ్ఞానమునుగోరు జిజ్ఞాసువులును, శ్రద్ధా

రహితులునుకూడ గురుసన్నిధికి వచ్చుచుందురు, కాని సాధుసత్తముడు ఉభయులను సమదృష్టితో నాదరించును,

199. చంద్రునికన్న, మంచుకన్న సాధువు చల్లనివాడు. భగవన్నామమే ఆతనికట్టి శైత్యశోభను ప్రసాదించినది.

200. సాధుజనులను జాతి యేమని ప్రశ్నించకు. జ్ఞానసంబంధమగు ప్రశ్నలడుగుము. కత్తికొనుటకుపోయి ఒరనుగురించిన నాణెమెందులకు ?

201. కోటానుకోట్లగు అసాధుజనులతో కలిసినను సాధుపురుషుని సాధుత్వము కుంటువడదు. సర్పస్పర్శచే చందనవృక్షము సహజగుణమగు చల్లదనమును వీడునా ?

202. సంకట సమయములందుకూడ ఒరులను కష్టపెట్టనివాడే నిజమైన సాధువు. రాలదెబ్బల కోర్చుచు పత్రపుష్పము లొసంగు వృక్షరాజము లట్టివేకదా !

203. సాధుపురుషునకు, అణిమాది సిద్ధులు లోకమున ప్రదర్శించు డాంబికునకు మామిడి తుమ్మచెట్లకున్నంత భేదము. మామిడికొమ్మను తీయని పండ్లు; తుమ్మకొమ్మను వాడి ముండ్లు.

204. హరియను నిందు కడలిలో సజ్జనుడొక ముత్తెపు

చిప్ప. ఆ సముద్రమెంత మనోహరము! అందుద్భవించిన ముత్యములు నావలలో పయ నించి దూర ద్వీపములు చేరుకొనును. (సజ్జన హృదయమందలి ప్రేమ జ్ఞానములు లోకమున కారోగ్యసౌందర్య ప్రసాదములు)

205. సాధుపురుషుడు ప్రేమ పిపాసువు; ధనపిపాసువు కాదు. ద్రవ్యార్జనకై సంచారము సేయువాడు సాధు వెట్లగును ?

206. సాధువు రత్నములతో నిండిన సముద్రము వంటివాడు. అంచు మందభాగ్యునకు మాత్రము గులకరాళ్లే దొరకును.

207. లక్షతుమ్మల అడవికన్న ఒక్కమంచి గంధపు చెక్క మేలు. హింసాత్మకమగు ఆధ్యాత్మిక సాధనలకన్న లవలేశమైనను సాధుసాధనయే మేలు.

208. హరికన్న హరిజనుడే శ్రేష్ఠుడు. (భగవంతుని కన్న భక్తుడే గొప్పవాడు) జగమంతా నిండి యున్న హరిని హరిజనుడు తన హృదయమున బంధించును.

209. సాధుపురుషుడు ప్రత్యక్ష దైవము. నిరాకారు డగు పరబ్రహ్మయొక్క సాకారమూర్తి యతడు. కావున సాధుసేవచేసి తరింపుము.

210. ఈశ్వర సంబంధమగు వాద ప్రతివాదములతో ప్రజలు భ్రమించి దారితప్పిరి. నిరపేక్షతో హరి భజనసేయు చతురుడొక్కడే సాధుకుల భూషణుడు.

211. తెలిసినమూర్ఖుని, బలవంతుడగు దుర్బలుని ఎవరు బాగుచేయగలరు!

212. శాస్త్రమర్యాదలకు కట్టుబడువాడు సామాన్యమాన వుడు. ఆ హద్దులు దాటినవాడు సాధుపురుషుడు. ఈ రెంటిని అతిక్రమించిన అగాధజ్ఞాన సంపన్నుడు పరమశ్రేష్ఠుడు.

213. సజ్జనుడు మేలిమిబంగారము వంటివాడు. నూరు ముక్కలైనను తిరిగి అతుకవచ్చును. దుర్జ నుడో వట్టిమట్టికుండ. దెబ్బకు పగిలిపోవును. మరి అతుకుకొనదు.

214. విషయవాంఛలను విసర్జించి జీవన్ముక్తుడై యుండు భక్తుని భగవంతుడు ముందు వెనుక లారయుచు అనుసరించుచుండును. అట్టి భాగ్యశాలికి దుఃఖ మెట్లు సంభవించును?

215. సజ్జనసంగతి సర్వదుఃఖహారము. దుర్జన సాంగత్యము ఏక్షణమున ఏ యుపద్రవము తెచ్చిపెట్టునో చెప్పశక్యముగాదు.

216. పంచభక్ష్యపరమాన్నములతోడి దుష్టసాం

గత్యముకన్న నూకలకూటితోనైన సజ్జనసాంగత్యమే మేలు.

217. అత్తరులమ్మువాని పజ్జవసించిన చాలు. సుగంధమనుభవింపవచ్చును. కొననక్కరలేదు. అట్టిదే సజ్జన సాంగత్యమును.

218. మధుర, ద్వారక, జగన్నాథము ఎన్ని తీర్థయాత్రలైన చేయుము; హరిభజన, సత్సంగతి లేనిది నీకు పట్టు దొరకదు.

219. సజ్జనసంగతిలేని దినము వ్యర్థము. భక్తి, ప్రేమయెరుగని వ్యక్తి పశుతుల్యుడు.

220. మనస్సు పక్షివంటిది. ఇచ్ఛ వచ్చిన ట్లెగురుచుండును. ఏ సాంగత్యము చేసిన నా ఫలమే లభించును.

221. కోటకందకమందలిజలము పానయోగ్యముకాదు. అదేనీరు గంగలో ప్రవహించినచో పవిత్ర గంగాజల మగును.

222. నగారామ్రోత ఆకస మావరించినది. శూరులు యుద్ధసన్నద్ధులై రణరంగమున నిలిచిరి. ఇక సమరక్రీడ ప్రారంభమగును. (మానవహృదయమున నిత్యము సాగుచుండు నింద్రియ దమనమను సాధకుని సంగ్రామ మిట సూచితము).

223. తన శరీరము ఖండఖండములైనను సమరాం

గుణము పీడని స్వామిభక్తుని శౌర్యము ప్రశంస నీయము. (అనన్యభక్తి సూచితము)

224. కవచధారణ సేయక, దేహమోహము విడచి, ఐహిక బంధముల చిక్కువడక, సంసార సమ రాంగణమున వీరవిహారము చేయు శూరుడు ప్రశంసార్హుడు. (కవచము = తాయిత్తు లేక మంత్రపుబిళ్ళ - వీనిపైన ఆధారపడక ఆత్మ విశ్వాసముతో సర్వార్పణ మొనర్చు భక్తశిఖా మణి-శ్లేష)

225. శూరుడు ఉభయసైన్య మధ్యస్థుడై జీవితాశ, మృత్యుభయము మనమున జేరనీయక రణ మొనర్చును గాని యుద్ధభూమిని వీడడు.

226. నీవు ఇలు విడచి బహుదూర మేతెంచితివి, రణము తప్ప వేరొండు మార్గములేదు. ఇక సంకోచమెందులకు? ఓ శూరాగ్రణీ! నీ స్వామికి ఆత్మార్పణ సేయుము.

227. తలదాచుకొను శుష్కప్రయత్నమేల? శిరచ్ఛేద నమే శిరోరక్షణకు పరమసూత్రము. వత్తి మండినగదా దీపము వెలుగుట! (ఇచ్చట సంపూర్ణమగు భక్తి శరణాగతి సూచింప బడినది.)

(మొదటి శిరమునకు అర్థము=అహంకారము, దేహాభి మానము — రెండవ శిరమునకు = జ్ఞానము, ఆత్మ గౌరవము.)

228. ఆధ్యాత్మిక సమరాంగణమున పరాజితుడ నైతినా గురుసేవచే బలవర్ధితుడనై పునః ప్రయత్న మొనర్చెద. జయించితినా కృతార్థుడనే. స్వామి సేవలో శిరచ్ఛేదమైనను చింతలేదు.

229. స్వామిని అన్వేషించునపుడు అనుక్షణము వియోగదుఃఖభయము వెన్నాడుచునేయుండును. తుదకు మరణమే శరణము కావచ్చును. అట్టి మృత్యువు ఎంత యోగ్యమైనది !

230. ధనుర్బాణములతో, తుపాకులతో పోరువాడు శూరుడుకాదు. మాయను త్యజించి ఈశ్వర భక్తిలో లీనమగువాడే నిజమైన శూరుడు.

231. సద్గురునిబోలు బంధువు, సాధు జనునివంటి దాత, భగవత్తుల్యుడగు హితైషి, హరిజన సదృశుడగు మనుజ శ్రేష్ఠుడు జగమునం దెంత వెదకినను కానరారు. (హరిజనుడు = భక్తుడు)

232. గుర్వోత్తముడు, గోవిందుడు, ఏకకాలమున దర్శనమిచ్చినచో నేను ప్రప్రథమమున గురు పాదకమలములకే దండప్రణామమొనర్చెద. ఏలయందువా నాకు పరమాత్మదర్శనమొసంగినది గురూపదేశమేకదా !

233. ఓ గురుదేవా ! క్షణమైన విశ్రాంతి తీసికొనక నిరంతర శిక్షణచే మనుష్యమాత్రుడనగు నన్ను దేవతను జేసితివికదా ! నీకివే శతాధిక వంద నములు.

234. ధరిత్రినంతా కాగితముచేసి, అరణ్యములన్నిటిని కలముగా, సప్తసముద్రములు సిరాగా సమర్చుకొన్నను గురుగుణములు వర్ణింప నాకు సాధ్యముకాదు.

235. విషయవివర్జితుడవై, అహంకారముపీడి, తనువు మనము అతని కర్పింపుము. నిన్నాతడే ఈశ్వరుని యందు లీనముచేయగలడు.

236. దేహధనాదులర్పించి మనసీయకున్న నిన్నాత డెట్లు విశ్వసించును ?

237. మనస్సను కత్తిని గురుదేవుడు చక్కగా సాన పట్టి తుప్పువదిల్చి అద్దము వలె చేయును.

238. శిష్యుడు మలినవస్త్రము; గురువు నేర్పరియగు రజకుడు. సృష్టికర్త యను సబ్బుతో ప్రేమ శిలపై నుతికి తేజోవంతముగ జేయును.

239. గురువు కుమ్మరి. శిష్యుడు కుండ. త్రొక్కి త్రొక్కి, పదునుచేసి, వంకలుతీసి, చేయూత నిచ్చి, పూర్ణకుంభముగా దిద్దితీర్చును.

240. గురువును వేరుగా దలచువాడు అజ్ఞానాంధుడు. భగవన్నిలయమునకు పోవు మార్గమున గురువు విశ్రాంతి నొసగు చల్వపందిరి. గురువుకడ కేగు దారిలో చల్వపందిళ్ళు లేవు.

241. గురుగోవిందులలో గురువే శ్రేష్ఠుడని నేను తరచి నిశ్చయించితిని. హరిస్మరణముకన్న

గురుసేవనమే సంసారసాగరమును అవిలంబ
ముగ దాటించగలదు,

242. గురుస్పర్శ పరుసవేది, చందనమువలె సుగంధ
బంధురము. జీవునకు సద్గురుస్పర్శ ముక్తిదాయ
కముకదా!

243. పండితుడు చదివి చదివి చచ్చుగాక; గురుచరణ
సేవలేక ఆత్మజ్ఞానము కలుగుటకల్ల. జ్ఞానము
లేనిది ముక్తిలేదు. ఇది ఆర్షవాణి (వేదవాక్యము)

244. ముల్లోకములలో నవఖండములలో గురువును
మించినవాడు లేడు. సృష్టికర్తకు సాధ్యముకానిది
కూడ గురువు సాధించగలడు.

245. భగవంతునితో కలహించినను గురుశరణమున
కృతార్థుడవు కావచ్చును. గురుకోపదగ్ధునకు
పరమేశ్వరసహాయము కూడ నిరర్థకమగును.

246. ఒకచో నున్నవస్తువును వేరొకచో వెదకిన
లాభమేమి? రహస్యవేదియగు గురుదేవుని
వెంటనిడికొని వెదకుము. దానిని తప్పకపొంద
గలవు.

247. ఈ శరీరము విషవల్లరి; గురువరేణ్యుడు అమృ
తాన్నము. గురునికొరకు శిరము మూల్యముగ
నొసగినను అదిచవుకబేరమే. సందేహములేదు.

248. కోటిచంద్రులు, సహస్రకోటి సూర్యులు ఏక

కాలమున నుదయించుగాక. సద్గురుప్రకాశము లేనినాడు లోకమంతయు అంధకారబంధురమే.

249. తరచి తరచి చూచినచో నీకే తెలియును గురువు పరుసవేదియని. దాని మహత్వము తెలియక నీవుపేక్షించితివి.' నీ పొరుగింటివాడు దానిని పొంది బాగుపడెను. అతడెవ్వరెవ్వరికిచ్చెనో వారందరు కృతార్థులైరి.

250. గురుదర్శకత్వమునగాక ఈ తెప్ప సంసార సాగరమునెట్లు తరించగలదు? దుర్గమసంసారఘట్టముల మునుగుచు తేలుచు నుండవలసినదే.

# కబీర్ సూక్తిముక్తావళి

## పరీక్ష

251. అయోగ్యులగు గురుశిష్యులు కలిసి ఈశ్వరునితో పందెము కట్టిరి. రాతిపడవతో ఏరుదాటబోయి ప్రవాహములో మునిగిపోయిరి.

252. వారిరువురు తెలిసియు తెలియనివారే. ఆచరణ హీనులకు తెలిసి ప్రయోజనమేమి? కబోది శిష్యునకు కబోది గురువు. ఇక దారిచూపు వారెవరు?

253. బానిస శిష్యునకు బానిసగురువు సంప్రాప్తమైన బంధ విముక్తియగుటెట్లు? బంధముక్తుని సేవించిన క్షణములో బంధముక్తుడవగుదువు.

254. తన్ను తా నెరుగడు. మాటలతో లోకమును

వంచింప జూచును. అస్వాధీనమగు ఆతని మనస్సే జన్మపరంపరలకు కారణము.

255. నీవు దప్పి తీర్చెదనని ఊరూర తిరిగెదవెందులకు? ఈ సంసార సాగరమున ఇంటింట ఉప్పునీరు కొల్లకొల్లలుగ గలదు. జ్ఞాన తృష్ణగల వ్యక్తి తనకు తానే పరుగు పరుగునవచ్చి జ్ఞానామృతమున దప్పితీర్చుకొనును.

256. సద్గురుమైత్రి యెరుగని శిష్యశాఖ లసంఖ్యాకములై పొడమినవి. అసద్గురు శిష్యుల సత్యలోక యాత్ర మనశ్చాంచల్యముచే భగ్నమైనది.

257. పచ్చని చెట్టుకు నీరుపోసిన చిగుర్చును. ఎండిన చెట్టుకెంత నీరుపోసిన నేమిలాభము?

258. మూర్ఖుడు ఇనుప కవచము తొడిగిన యుద్ధ గజము. ఉపదేశబాణములందు చొరబడవు.

259. పశువు నీపాలబడినది. శాంతించుము. కోపమేల? ఊసరక్షేత్రమున జల్లిన విత్తనములు మొక్క మొలుచునా?

260. చందనవృక్షసమీపమున నుద్భవించిన వేపచెట్టు సైతము చందనగంధ బంధురమై ఘుమఘుమలాడును. సజ్జన వ్యక్తి సంసారసాగరమున మునుగువారికి నిజజీవితాదర్శమను తెప్పతో సహాయ మొనర్చును.

261. నడక కొంగనడక, హంస ననిపించుకొనవలెనని గంపెడాశ. హంస ముత్తెములు మేయును. కొంగ కదెట్లు సాధ్యమగును ? కాలపాశబద్ధునకు ఈశ్వర ప్రేమపానమెట్లు లభించును ?

262. నాలుగు రుద్రాక్షమాలలు ధరించినంతమాత్రమున సాధువగునా ? బాహ్యవేషము లోని దోషమును హరించునా ?

263. మాలలు ధరించి, బొట్టుపెట్టినంతమాత్రమున భక్తిగలుగదు. గడ్డములు మీసములు గొరిగి సంసారమున మునకలిడువాని కేమిలాభము ?

264. మీసములు, గడ్డములు తీసిన ప్రయోజనమేమి ? మనమునందలి దోషములు తీసివేయవలె.

265. తలగొరిగినంతమాత్రమున మోక్షప్రాప్తియగుచో నందరునట్లే చేయుదురు. గొఱ్ఱెకు ఎన్నిమార్లు బొచ్చుకత్తిరించుటలేదు ! అది వైకుంఠమున కేగినదా !

266. పాపము తలపెండ్రుకలేమి చేసినది మాటిమాటికి గొరుగుచుందువు ? మనసులోని విషయ వికారములకు క్షురకర్మ యొనర్పుము.

267. పిచ్చివాడా ! పుట్టపొడిచెదవేమి. పామును చంపుము. నిన్నుకరచునది పాముగాని పుట్టకాదు.

268. ఏ విభూతి సాధుజనులచే విసర్జింపబడెనో దానిని నీవు ఒడలెల్ల పూసుకొను చుంటివి. కక్కిన కూటి కాసించు కుక్కవాయేమి ? (విభూతివైశ్వర్యము, బూడిద).

269. నీవు ప్రేమ రసోన్మాదివని నాతలంపు. ఒక్కింత గాలి సోకెనా కోడెత్రాచువలె తోకపై లేచి నిలిచెదవు. (పరమేశ్వరునియందు ఏకాగ్రభక్తి సూచింపబడినది).

270. ఒరుల మాటలు విని సజ్జనుడు దుర్జనుడైనాడు. కంచు రాగియైనది. బంగరువెల దానికెట్లు వచ్చును. (యోగభ్రష్టుడు.)

271. ఇది రాళ్ళతోనిండిన యినుపనావ. (ఈ తనువు విషయవాంఛలతో నిండి యున్నది) సంసార సాగరమెట్లు తరించును? పైగా దీని తలపై నొక విషపుమూట! (పాప సంచయము).

272. సకలదుశ్చింతలను విసర్జించి బ్రతుకుబాటసరిచేసి కొనుము, కాకివలె జీవించకుము. హంసవలె బ్రతుకుము.

273. చందనవృక్షమును సర్పము చుట్టుకొన్నది. దానికి రోమరోమమున విషమే. అందు అమృతోద్భవమెట్లగును? (చందనవృక్షము సజ్జనుడు - కాలసర్పము దుర్జనుడు)

274. మలయగిరి నివాసముచే పలాశ వృక్షముకూడ (మోదుగచెట్టు) మారినది. యుగయుగములు సమీపముననుండియు వెదురుమాత్రముమారలేదు. వెదురుకు లోన డొల్లయగుటచే దీనికికారణము. (లోపల సరుకులేదు)

275. మూర్ఖుడను మొక్కను నాటినావు: వేయిసార్లు ఉపదేశామృతముతో తడిపినావు. ఏమిలాభము? పుత్తెలో పుట్టినబుద్ధి పుడకలతోనే పోవునది.



# కబీర్ సూక్తిముక్తావళి

## వివేకము

276. ఈ శరీరమున శబ్ద బ్రహ్మమున్నది. ఆ తంత్రులను మీటనక్కరలేదు. నాదము తనంతటతానే ఉద్భవించును. బాహ్యాభ్యంతరముల నిత్యమురవళించు అనాదమే నా భ్రమలన్నిటిని దూరీకృతమొనర్చినది.

277. అందరు "శబ్దము శబ్దము" అను వారే. శబ్దమునకు కాలుసేతులులేవు. ఒక శబ్దము దివ్యౌషధమువలె పనిచేయును. వేరొకటి హృదయమును కలచి గాయపరచును.

278. వాగర్థ ప్రవీణునకు శబ్దమునకు మించిన ధనము లేదు. వజ్రమునకు విలువ కట్టవచ్చును. శబ్దము అమూల్యము.

279. నాసిద్ధాంతమే మహామంత్రము. నావలె నైతివా నీకునుఅంతే. శబ్దబ్రహ్మము మన కల్పవృక్షము. ఏదికోరిన అది యిచ్చును.

280. అహంకారము వీడి చల్లగా మాట్లాడుట అభ్యసించుము. ఏలయందువా శబ్దరూపియగు పరబ్రహ్మమును, శబ్దరూపియగు శత్రువు నీలోనే యున్నారు.

281. యంత్రతంత్రములన్నియు వట్టిబూటకములు సుమా! ఆభ్రమలో చిక్కుకొనకు. శబ్దసారమెరిగిననే కాకి హంసయగుట.

282. స్మృతి నొసంగుము దేవా! నేనీ సంసారజలధిలో చిక్కుకొనినాను. నీవు చేయూత నీయకున్న నేనిందు మునిగిపోక తప్పదు,

283. ఏముఖము పెట్టుకొని విన్నవింతును ప్రభూ! నాలోనాకే సిగ్గగుచున్నది. విన్ను చూచుచునే పాపకర్మ లొనర్చుచుంటిని. నీకు నాయెడ కృప కలుగుటెట్లు?

284. నేను ఆజన్మాపరాధిని. నఖశిఖపర్యంతము వికారములే. నీవు దుఃఖభంజనుడవట! ఏదీ నన్ను రక్షించుము చూతము!

285. నే నెన్నో తప్పులు చేసినాను. అవి తప్పులని

కూడ నే నెరుగను. ఈ సేవకుని క్షమించుము. శిక్షించుము. నీచిత్తము; నా భాగ్యము.

286. భగవాన్! లక్షలాది భక్తులు నిన్ను ప్రేమింతురు గాక; నన్ను మాత్రము మరువవలదు. నావంటి వారు నీకనేకులు. మరినాకో, నిన్నుబోలువాడు మరొకడు లేడు.

287. ఆత్మకు ఆధారుడవగు అంతర్యామివి నీ వొక్కడవే. నీవే నాచేయి విడిచిన ఇక నన్ను దరిజేర్చువారెవరు?

288. నా చిత్తము నీ యందు లగ్నమైనది. నీ మనస్సు పరాధీనమైయున్నది. ఒకే చిత్తము రెండు తావులనుండుట సాధ్యమా? ఇది సమర్థనీయ మెట్లగును?

289. నాహృదయము ప్రేమరసరహితము. నాశరీరము సౌందర్యరహితము. ఇట్టి నేను ప్రియతమునితో నేకాంత మెట్లొనర్తును.

290. నాలో చెప్పదగిన విశేషమేమియులేదు. గుణలేశ మేమైనగలదేని అది భవదీయమే. నీది నీకిచ్చుటలో గొప్పమేమున్నది?

291. స్వామీ! నీవు సర్వసమర్థుడవు. దృఢమగు కరావలంబనమొసంగి లక్ష్యమును జేర్చుము. మార్గమధ్యమున విడువకుసుమా!

292. ఎచ్చోటకరిగిన తిరిగిరారో ఆ దివ్యధామమునకు మార్గము నేనెరుగుదును. కర్మభారమును శిరము నందిడికొనిగదా ప్రజలిందుండి ప్రయాణమగుట:

293. పరమాత్మ ప్రేమతో నన్ను పిలుచుచున్నాడు. కాని నేనటకేగుటలేదు. పరమపవిత్రు డాతడు. సమస్త వికారములచే అపవిత్రుడనగు జీవాత్మను నేను. ఆతని పాదసన్నిధి కెళ్లేగగలను?

294. వెళ్ళవలసిన ఊరుపేరెరుగని ప్రయాణమిది. ఎంతదూరమేగినను అక్కడి కరమైలే. ఇట్లు యుగాలు గడిచినవి.

295. అందరు "వెళ్లువెళ్లు" మందురు. నా ఆశంకవేరు. వారు స్వామినెరుగరు. స్థానమెరుగరు.

296. చీమచొరజాలని, ఆవగింజైన నిలుపజాలని సూక్ష్మాతిసూక్ష్మమగు స్థానమున నీ మనస్సు నిలుపుము. తప్పక లక్ష్యసిద్ధి కలుగును. (అణోరణీయాన్)

297. యాత్రికుడు తప్పుత్రోవపట్టిన మార్గమేమి చేయగలదు! మార్గమెన్నుకొను బాధ్యతనీదే, బాగుచేసికొను బాధ్యతయు నీదే.

298. చావుగోరెదవా; సంసార బంధముక్తి నొసంగు చావునే కోరుము. కష్టములపాలై రోజుకు వేయిసార్లు చావనేల?

299. సంసారసాగరమున మునిగిపోవు నన్ను ఉపదేశామృతహస్తముల కేశగ్రహణమొనర్చి, పైకీడ్చి, తీరము జేర్చు మహనీయుడు కానరాడు కదా!

300. విహారాగ్నితప్తమగు ఈ లోకమున నాకు ప్రేమార్ద్రుడొక్కడును కానరాడు.

301. వెదకి వెదకి వేసారితిని. నే కోరిన గురువర్యుడు లభించలేదు. ఎట్లు లభించును? తత్త్వవేత్త త్రిగుణాతీతమగు నిర్గుణ పరబ్రహ్మ ధ్యానమున నిమగ్నుడై యుండునుకదా!

302. పాముకు పాలుపోసిన విషమగును. విషముద్రావి అమృతత్వమిడు గురూత్తము డగుపడడు.

303. లోతునీట దుమికి వెదకిన అమూల్యరత్నము లభించును. భయపడి గట్టుపై కూర్చున్నవాని కెట్లు దొరకును?

304. వెదకి వెదకి వెదకబడ దగిన యోగ్యత గడించితిని (జీవాత్మనై అన్వేషించి పరమాత్మనైతిని). నీటిబిందువు సముద్రమున కలిసిపోయినది. ఇక దానిని విడదీసి వెదకుటెట్లు?

305. అన్నిట నిండియుండు వాడొక్కడే. వానియందే సకలము కూడి యున్నది. జ్ఞాననిష్ఠుడగు కబీరు నకు వేరొకడు కానరాడు.

306. దుష్టవాతావరణమున పత్రమును బైటపెట్టకుము. గట్టిగా బిగించి, ముడివేసి సీదారిని పొమ్ము. (అసభ్యులకు బ్రహ్మాను భూతి వివరింపకుము.)

307. హంస ముత్తెమున కాసపడును. కంకరకు మూచూపదు. మానస సరోవర తీరమున హంసలుకలవు. కొంగలునుగలవు. (సుజన దుర్జన భేదము వేషభాషలలో కనబడదు. చేత లలో బయట పడును.

308. హంస ముత్యము నన్వేషించును. కంకర జోలికిపోదు. కొంగ చేపల కెగపడును.

309. మంచిగంధము విదేశముల కేగెనట; అక్కడి వారు దానిని మోదుగ చెక్కయనుకొని పొయిలో పెట్టి వంట కట్టెవలె ఉపయోగించిరట; ఐనను అందుండి సుగంధమే వెలువడెనట!

310. నామరత్నమును గుప్తమొనర్చుము, మాటి మాటికి మూటవిప్పకుము. అది అమూల్యము. దానిని పరీక్షింపగల వ్యక్తి ఏ పట్టణముననులేదు.

311. జీవాత్మ పరుసవేది. ఈ సంసారమొక ఇనుప తునుక. ఇది జీవాత్మను పరీక్షించి ఆందలి దైవాంశను రుజువుచేయును.

312. ఆత్మజ్ఞానామృత చూర్ణముగల పొట్లము బహు విధసాధనాఫలముగ నాకు లభించినది.

సిబోంల్లోపర్రైన ఁటన్థించిన డీనిని పానకము
చేసి త్రాగించెద.

813. మనస్సు ఒక కాటుకకొట్టు. శరీరమొక కాటుక
కోట. కాని పరమాత్మ రక్షణ లభించినజీవున
కా నలుపంటదు.

814. జ్ఞానరత్నముంచిన (శరీరమను) కొట్టుకు
గట్టిగా తాళమువేయుము. సాధుపురుషుని సమక్ష
మున తేనియలూరు తేటమాటలను తాళపు
చెవితో అద్దానిని తీయుము.

815. ఈ ప్రపంచమున రత్నములు రాళ్ళు కలిసి
యున్నవి. వాని విచక్షణ సద్గురునకే యెరుక.

816. పరునిచిత్తము పరీక్షించగలవాడే సమర్థుడు.
సాధన కుపకరించు పటిక బెల్లమువంటి ఈ
శరీరమును ఉప్పని భ్రమించువాడు మూర్ఖుడే
కదా!

817. దుఃఖమేఘములను ప్రసన్నతతో సహించువాడే
పురుషరత్నము. కపట వేషధారులగు మనుష్యు
లను పరీక్షించిన దోషములే బయల్పడును.

818. హరి అనర్ఘరత్నము. సద్గురువు రత్నవర్తకుడు.
లోకులు చిల్లరవ్యాపారులు. రత్న పరీక్ష సద్గురు
నకే సాధ్యము.

819. రత్నము ధూళిధూసరితమై నడి బజారులో పడి

యున్నది. మూర్ఖులెంద రాత్రోవను త్రొక్కు కొనుచు చనుచున్నారు! అడుగో దాని విలువ తెలిసిన మహావ్యక్తి!

320. అంధకారబంధురమగు కలియుగమున గురూపదేశ మెవరికికావలె! హితము చెప్పినవాడే పరమ శత్రువు.

# కబీర్ సూక్తిముక్తావళి

## సఫలత

321. అందరు సహజ యోగమని కేకలిడువారే. దాని అంతర్య మొక్కరును యెరుగరు. సహజమార్గమున ఈశ్వర సాక్షాత్కారము పొందినవాడే సత్యమగు సహజయోగి. (కబీర్ ఉపాసనా మార్గము సహజ యోగము.)

322. సహజయోగ ప్రభావమున ధనపుత్రవ్యామోహములు నశించినవి. ఇచ్ఛానిచ్ఛలు అడుగంటినవి. దాసుడు కబీర్ స్వామితో ఏకమై తాదాత్మ్యము పొందినాడు.

323. సహజసాధనాఫలము మధురాతి మధురము. బలవంతమున చేయుసాధన వేపవలె చేదగును.

324. స్వాభావికమైనది క్షీరమువలె మధురము. అడిగి తెచ్చుకొన్నది జలతుల్యము. ఇక అస్వాభావికము, బలవంతము అగునది రుధిరప్రాయము.

325. ఈశ్వరుడు కడుంగడు బరువనిన భయపడెదరు. కడుతేలికయందునా అది అసత్యమగును. కంటికగుపడని స్వామిని నే నెట్లు వర్ణింపగలను?

326. చూచినను చెప్పుటెట్లు? చెప్పిన విశ్వసించు వారెవరు? అతడెట్లున్ననేమి? ప్రసన్నహృదయుడనై గుణగాన మొనర్చెదగాక!

327. ఈశ్వరస్వరూప మత్యద్భుతము. నిర్వచించు కోరిక గలదేని నిగ్రహించుటమేలు. వేదము, ఖురాను వర్ణించలేక మౌనముద్ర దాల్చినవి. అట్టిపరమాద్భుత స్వరూపమును నేను చిత్రించిన నమ్ము వారెవరు?

328. చూచినవారు చెప్పరు. చెప్పువారు కనలేదు, వినలేదు, అనుభవించలేదు. అది పంచేంద్రియముల కతీతమైనది.

329. అది వాదవివాదములకు, వాక్చమత్కృతులకు అందునదికాదు. కావుననే ద్రష్టలు మౌనముద్రాంకితులై అగాధమగు నామస్మరణమున నిమగ్నులై యుందురు.

330. పరబ్రహ్మమను సముద్రమున మునిగి తేలితివి. బ్రహ్మజ్ఞానమను నీరమును దోయిలించితివి. అందనేక వస్తువులున్నవి.

331. సముద్రమున మునిగి, ఆకాశమున తేలితిని,

గగనమండల నివాసినై బ్రహ్మసాక్షాత్కార మందితిని. (గగనము శూన్యము; ఉన్నతము.)

332. నామదీక్ష డాంభికునకు గాదు. సత్యప్రతిజ్ఞునకు. అందు తీర్ణుడైనవాడు జీవన్ముక్తుడే. సందియము లేదు.

333. మనుష్యలోక మెన్ని సార్లు మృత్యుముఖము జొచ్చుచున్నది ! పూర్ణమృత్యువనునది కాన రాదుకదా ! కబీర్‌దాసు మరణ మట్టిదికాదు. దానికి తిరుగులేదు.

334. ఎల్లరకు భయంకరమగు మృత్యువు నా కానంద కరము. నా కదియే బ్రహ్మానందదాయకము.

335. తనువు శుద్ధముకానీ, కలుషితముకానీ, సురక్షితముకానీ, శాశ్వతము మాత్రము కాదు. నేనొక ఆశ్చర్యకరమగు దృశ్యము గాంచితిని. మృత్యువు కాలుని జయించినది. ఆతడు జీవన్ముక్తుడైనాడు. (కబీర్‌దాసు మరణముచే యముని జయించి అపునరావృత్తి పదము నందు కొనినాడు.)

336. పాంథజనుల మార్గమున కరకురాతివి గాకుము, నిరుపద్రవమగు మెత్తనిధూళివై లోకమున చరించుము. అదియే సాధుజన లక్షణము.

337. ధూళివైనంత మాత్రమున నేమి లాభము ! గాలి కెగిరి శరీరమును మలినము చేయవచ్చునుగదా !

సరియైన సాధువు సమస్త మలినములను శోళనము చేయు స్వచ్ఛ నీరమువంటివాడు.

338. నీరమైనను ప్రయోజనములేదు. దానికి శీతోష్ణాది గుణము లుండును. నిజమైన సాధువు హరివలె ద్వంద్వాతీతుడు కావలె.

339. హరియైననేమి ? సృష్టి లయము లాతని ఖేలయే గదా ! సాధువు హరిభజనముచే నిర్మలుడు కావలె.

340. నిర్మలుడైనను చాలదు. నిర్మలుడు నిర్మల ప్రదేశమునే వాంఛించును. రెంటికిని అతీతు డగువాడే సాధువు.

341. జీవన్ముక్తుడెంత సాహసి ! బాహ్యప్రవృత్తుల నిరోధించి సమాధియనుపాతాళము ప్రవేశించును. బ్రహ్మపదార్థమును పొంది పైకి వచ్చును.

342. ఈశ్వరప్రాప్తి కలిగినదన్నవాడు వట్టిపిచ్చివాడు. జారవిడిచితి ననువాడు పరమమూర్ఖుడు. నీ వెప్పుడూ పరిపూర్ణుడవే. ఒకప్పుడు వచ్చినది లేదు. ఒకప్పుడు పోయినది లేదు.

343. భజనచేయుదమన్న అర్హులెవరు ? భజించుటకు గాని, త్యజించుటకుగాని వీలులేక మధ్యస్థమై యుండు స్వస్వరూపమే నా ఉపాస్యదైవము.

344. అతివృష్టి, అత్యుష్ణము, ఎట్లు త్యాజ్యములో అతిభాష, అతి మౌనము అట్లే.

845. మాటలు చెప్పుట పటికబెల్లము తినునంత తేలిక. ఇక ఆచరణమో? విషజ్వాలవలె కష్టతరము. మాటలు మాని చేతలకు దారితీయుము. అప్పుడు విషమే అమృతమగును.

846. ఉపదేశము లుడిగి ఆచరణ వైపునకు చిత్తము మరల్చుము. నీరు త్రాగినకదా దాహము తీరునది?

847. అజ్ఞాని రాత్రింబవళ్ళు అక్కడక్కడ వినిన మాటలను ఇతరుల కుపదేశించుచు కుక్కవలె తిరుగును. ఆచరణశూన్యమగు ఈ మాటలకు కుక్క మొరుగులకు భేదమేమి?

848. అక్షరచౌర్యముచేసి కైత అల్లితివి. ఈ యెంగిలి కూటితో ఎన్నాళ్ళు బ్రతుక గలవు?

849. నీకు నీరులేదు. ఇతరులకు పాలుపంచ జూచెదవు. నీకు చిత్తస్థైర్యములేదు. ఇతరులకు ధైర్యము చెప్పబూనెదవు. (ఏమిటీ వెఱ్ఱి?)

850. చెప్పుట కర్మగాదు, అకర్మ. చేయుటయే జీవిత సారము. ఉత్తమాచరణముతో సంసార సాగరమును తరించుము.

851. పదములు జోడించి కయిత అల్లుటతో తృప్తి పడకుము, ఒకరుతోడిన నీరు త్రాగుటకంటె నీవే తోడుకొని త్రాగుటమంచిది.

852. తత్త్వగ్రహణము, ఆచరణ లేని కవిత్వమేల? మోహజల పూర్ణమగు సంసార వాహినిలో కాలునిలచునా? (స్థిరబుద్ధి కలుగునా?)

353. అందరు చెప్పువారే. చేయువారు కానరారు. అట్టివారిని మునుగనీ తేలనీ; వారి గొడవ నీకేల?

354. చేయదలచిన పని ఏకాగ్ర బుద్ధితో చేయుము. రెండు పను లేక కాలమున చేయబూనితివా నవ్వులపాలౌదువుసుమా! పరస్పర విరుద్ధము లగు మాటలాడు వానిగతియే నీకును పట్టును.

355. తీయని మాటలతో మనోభావమును మరుగుచేసి చతురుడనని సంతసించు వానికంటె రాముడే చతురుడుసుమా!

356. ఏది చెప్పుదువో దానినే చేయుము, ప్రాప్తికి ప్రేమకు పరస్పర సంబంధము. ఈశ్వరాకర్షణ లేనిది నీ వీ సంసారయుద్ధము నుండి యెట్లు బయట పడగలవు?

357. సుముఖుడుగాని శ్రోతకు ఆచరణశూన్యుడగు వక్త యెంతచెప్పిన నేమిలాభము? శ్రుతికలిసిన గదా సుఖమొదవుట! (నీనోట పలికిన మాట నీ చిత్తము గ్రహించి ఆచరించినపుడే జీవిత మాధుర్యానుభవము.)

కబీర్ సూక్తి ముక్తావళి

సమాప్తము.